క్లుప్తంగా

ప్రభుత్వ విప్,ఎమ్మెల్యేను కలిసిన జేఏసీ నాయకులు



విప్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న జేఏసీ నాయకులు

జగిత్యాల/ధర్మపురి: తమ సమస్యలు పరిష్కరించాలని టీజేఈఈ జేఏసీ నాయకులు శనివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను వేర్వేరుగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని 57 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని విప్‌కు, ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, చైర్మన్లు ఎండీ వకీల్, మచ్చ శంకర్, చంద్రయ్య, గంగారాజం, మ్యాన పవన్‌కుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టండి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో అకస్మికంగా తనిఖీ చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రేకుల షెడ్డు శిథిలావస్థలో ఉందని, కూల్చివేయడానికి అనుమతించాలని హెచ్‌ఎం రాజన్న వినతిపత్రం ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రశేఖర్ ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



డ్రైయినేజీని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్, అధికారులు

కథలాపూర్: మండలకేంద్రంలో పారిశుధ్య పనులను ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, ఎంపీడీవో శంకర్, ఎంపీవో రాజశేఖర్, ఏఈ జగదీశ్వర్ శనివారం పరిశీలించారు. పలువాడల్లో డ్రైయినేజీలు శిథిలావస్థలో ఉండటంతో కొత్తగా 300 మీటర్లు డ్రైయినేజీ నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. దీనికోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా డ్రైయినేజీ నిర్మాణానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు.

విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి



విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న అధ్యాపకులు

మల్లాపూర్: పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు రాజేందర్, నరేశ్, శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లిలో శనివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత బస్‌పాస్, స్కాలర్‌షిప్‌లతో పాటు విశాలమైన తరగతిగదులు, అనుభవజ్ఞులైన ఆధ్యాపక బృందంతో ప్రభుత్వ కళాశాలలో బోధన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం కోసం రూ.లక్ష విరాళం

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి భక్తుల అన్నప్రసాద వితరణకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు ఇనుకొండ చంద్రారెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొనేందుకు వచ్చిన చంద్రారెడ్డి స్వామివారిని దర్శించుకున్న అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి రూ.1లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డిని అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ కల నెరవేరేనా?

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న భీమారం మండల ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- అవకాశాలున్నా.. అభివృద్ధి శూన్యం



పూడికతో నిండిపోయిన భీమారం పెద్ద చెరువు

మేడిపల్లి: భీమారం పెద్ద చెరువు మినీ ట్యాంక్ బండ్‌గా చేయాలనే మండల వాసుల కోరిక ఏళ్లుగా కలగానే మిగిలిపోతుంది. మేడిపల్లి–భీమారం–వేములవాడ డబుల్ రోడ్డుకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండి మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి అన్ని అవకాశాలు ఉన్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. భీమారం చెరువును మినీ ట్యాంక్ బండ్ చేసి టూరిస్ట్ హబ్ గా చేయాలని మండల ప్రజలు, వాకర్స్ కోరుతున్నారు.

200 పైగా ఎకరాల్లో పెద్దచెరువు

భీమారం పెద్ద చెరువు సుమారు 200 పైచీలుకు ఎకరాల్లో విస్తరించి, చెరువుకి మూడు వైపుల రోడ్లతో ఉంది. ఒక్క రౌండ్‌లో సుమారు 5–6 కిలోమీటర్లు వాకర్స్ తిరిగిరావచ్చు. కానీ పెద్ద చెరువుని పట్టించుకునేవారు లేక లీకేజీలతో నీరంతా వృథాగా పోతోంది. తూంలు, అలుగు శిథిలావస్థకు చేరుకున్నాయి.

మినీ ట్యాంక్ బండ్‌కు అవకాశాలు

భీమారం పెద్దచెరువు కట్ట సామర్థ్యం పెంచాలని, మండల ప్రజలు కోరుతున్నారు. కట్ట చుట్టూ చెరువు లోపల పిచ్చి మొక్కలు తొలగించాలని, కట్టపై వాకర్స్‌కు అనుగుణంగా సామర్థ్యం పెంచి, వాకింగ్ ట్రాక్, లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కట్టకు డబుల్ రోడ్డుకు అనుకుని ఉన్న స్థలంలో పార్క్ ఏర్పాటు చేసి టూరిస్ట్ హబ్‌గా చేయాలని కోరుతున్నారు. వర్షాకాలం సంవృద్ధిగా నీరు చేరినా.. చెరువులో భారీగా పూడికపేరుకుపోయి నీటి స్టోరేజీ అంతంత మాత్రంగానే ఉంది. చెరువులో పూడిక తీయించి మత్తడి ఎత్తు పెంచాలని, చెరువు నిల్వ సామర్థ్యం కూడా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

భీమారం పెద్ద చెరువు ప్రాజెక్ట్ చరిత్ర

చిన్న తరహా నీటి పారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 1992లో అప్పటి మెట్‌పల్లి ఎమ్మెల్యే చెన్నమనేని విద్యాసాగర్ రావు కృషితో ప్రాజెక్ట్ నిర్మించారు. తర్వాత ప్రాజెక్ట్ సుందరీకరణకు దివంగత మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములు ఆలోచన చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకరించి భీమారం పెద్దచెరువును మినీట్యాంక్ బండ్‌గా చేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



చెరువు లో పిచ్చి మొక్కలు

టూరిస్ట్ హబ్‌గా మార్చాలి



భీమారం మండల అబివృద్ధి పెద్ద చెరువుతో ముడిపడి ఉంది. ప్రదాన రహదారికి సుమారు రెండు కిలోమీటర్ల మేరా పెద్ద చెరువు అనుకొని ఉంది. పార్క్ ఏర్పాటు చేసి, మినీట్యాంక్ బండ్ గా సుందారికరించి టూరిస్ట్ హబ్ మార్చాలి. – కారండ్ల మధుకర్, మాజీ సర్పంచ్, గోవిందారం

అభివృద్ధికి కృషి చేయాలి



భీమారం ఇటీవలే మండల కేంద్రంగా ఏర్పడింది. మౌలిక వసతులు ఇప్పుడిప్పుడే సమకూరుతున్నాయి. మండలం మరింత అభివృద్ధి చెందాలంటే జనావాసాలు పెరగాలి. పెద్ద చెరువుని మినీ ట్యాంక్ బండ్‌గా సుందరికరిస్తే టూరిస్ట్ హబ్‌గా మారుతుంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉంది కాబట్టి రవాణా పెరుగుతుంది. – చెక్కపల్లి రఘు, భీమారం మాజీ సర్పంచ్

నాయకులు పట్టించుకోవడం లేదు



భీమారం పెద్ద చెరువుని మినీట్యాంక్ బండ్ చేయాలని ఏళ్ల నుంచి ప్రజాప్రతినిదులను కోరుతున్నాం. తూం, అలుగు లీకేజీలతో నీరంత వృథాగా పోతుంది. ఎన్నిసార్లు చెప్పిన కానీ నాయకులు పట్టించుకోవడం లేదు. మండలం అభివృద్ధి చెందాలంటే పెద్ద చెరువుని మినీ ట్యాంక్ బండ్ చేసి టూరిస్ట్ హబ్‌గా మార్చాలి. – గుగ్గిళ్ల రవిగౌడ్, భీమారం



సారంగాపూర్: మండలంలోని రేచపల్లి–రంగపేట గ్రామాల మధ్య పంచాయతీ రాజ్ శాఖ రోడ్డు వేశారు. రెండు గ్రామాల మధ్య ఎస్సారెస్పీ డీ–53 ప్రధాన కాలువ సమీపంలో రంగపేట అటవీశాఖ నర్సరీ వద్ద 500 మీటర్ల రోడ్డును అటవీశాఖ ప్లాంటేషన్ నుంచి వెళ్తుండడంతో అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో 500 మీటర్ల రోడ్డుకు కంకర వేసి వదలిపెట్టారు. అటవీశాఖ అనుమతులు ఇస్తే ఈ రోడ్డు పూర్తవుతుందని,అనుమతి ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రవిప్రసాద్,డీఎఫ్‌వో, జగిత్యాల, సెల్ నం.: 9490357522

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

కుల గణన, జనగణన నిర్ణయంపై హర్షం



ధర్మపురిలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి : దేశంలో కుల గణన, జన గణన చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణయం చారిత్రాకమని బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు గాజు భాస్కర్ అన్నాడు. కేంద్రప్రభుత్వం తీసుకున్న కుల గణన నిర్ణయంపై హర్షిస్తూ ధర్మపురిలోని నంది కూడలి వద్ద ప్రధానమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు లక్ష్మణ్, వైకుంఠం, శ్యామ్, రాయిల్ల రవికుమార్, గుండయ్య తదితరులున్నారు.

వెల్గటూర్ : దేశంలో జనగణనతో పాటు కులగణన చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని మండల బీజేపీ అధ్యక్షుడు గోపతి జనార్దన్ అన్నారు. శనివారం వెలగటూర్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు.

మల్లాపూర్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో జనగణన, కుల గణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బీజేపీ నాయకులతో కలిసి శనివారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి వాకిటి తిరుపతిరెడ్డి, మల్లాపూర్ పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్‌కుమార్, ముత్యంపేట బూత్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, శక్తి కేంద్రాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



హన్మాజీపేటలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాలరూరల్: డ్రెయినేజీ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేటలో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన రూ.15 లక్షలతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ పనులను నాణ్యత ప్రమాణాలతో పాటు, పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, పాలెపు రాజేంద్రప్రసాద్, బొడ్డు దామోదర్, మహేశ్, మధు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి అండగా ఉంటాం

రైతు కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి ఆత్మహత్య చేసుకోగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గర్వందుల రాజేశ్వరి మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

కార్యవర్గాన్ని రద్దు చేయాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

జగిత్యాల: తెలంగాణ నాలుగోతరగతి ఉద్యోగుల జిల్లా సంఘం జగిత్యాల ప్రస్తుత కార్యవర్గాన్ని రద్దు చేయాలని జగిత్యాల క్లాస్ ఫోర్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఏర్పాటు చేయాలని సమాచారం ఇచ్చినా మూడు సమావేశాలకు హాజరు కాకపోవడం, గైర్హాజరుకు సంజాయిషితో కూడిన సమాదానం ఇవ్వాలని ఏప్రిల్ 16న నోటీసు ఇచ్చినా సమాదానం రాలేదన్నారు. సంఘం నియమావళి, నిబంధన 55–4 ప్రకారం మూడు సమావేశాలకు హాజరు కాకపోతే కార్యవర్గం రద్దు అవుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దాస్య, సెక్రటరీ హసన్ పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా వేతనాలు లేవు



పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

సారంగాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు నాలుగు నెలల నుంచి వేతనాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద తమ గోడును వెల్లబోసుకున్నారు. గ్రామాల్లో అడిగిన వెంటనే జాబ్‌కార్డు మంజూరు చేసి, వారికి వంద రోజులు పనికల్పించడంతో గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ శాఖలో పనిచేస్తున్న ఏపీవో, టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు జనవరి నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు ఈ నెలలో అందకపోతే సమ్మె బాట పట్టే యోచనలో ఉపాధిహామీ సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. తీవ్రమైన ఎండలో ఆరోగ్యాలను లెక్కచేయకుండా ఫీల్డ్‌మీదే ఉంటే పనులు చేయిస్తున్నామని, తమకు ఇళ్లు గడవడం కూడా కష్టంగా ఉందని, ప్రభుత్వం తక్షణమే వేతనాలు విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల శాఖ అధ్యక్షుడు మామిడాల మల్లేశం, ప్రధాన కార్యదర్శి సదానందం, కార్యవర్గ సభ్యులు కోరారు.

కమిషనర్ హామీతో కార్మికుల సమ్మె విరమణ

మెట్‌పల్లి: సకాలంలో వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కమిషనర్ మోహన్ వెంటనే కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడగా, రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆయన మార్చి నెలకు సంబంధించిన వేతనాలు సాంకేతిక సమస్యతో రాష్ట్ర వ్యాప్తంగా చెల్లించలేదని, ఏప్రిల్ వేతనాలను వెంటనే చెల్లించేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు. దీంతో వారు సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. సాయంత్రం లోపు అందరి ఖాతాల్లో ఒక నెల వేతనాన్ని జమ చేశారు.

యువకుడి మృతదేహానికి విప్ నివాళి

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన గాజ బ్రహ్మానందస్వామి అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందగా... ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు



పూజలు చేస్తున్న విద్యాసాగర్‌రావు

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేటలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీలగిరి పెద్దమ్మతల్లి జాతర మహోత్సవాల్లో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో శనివారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మాన్ని సంరక్షిస్తూ, చరిత్రను తెలుసుకుంటూ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను చాటే విధంగా ప్రజల్లో చైతన్యం రావాలని అన్నారు. గ్రామస్తులు, వీడీసీ సభ్యులు విద్యాసాగర్‌రావును సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోరు నాగేష్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్, నాయకులు రంజిత్, నాగరాజు, లింగారెడ్డి, రాజం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి

జగిత్యాలక్రైం: విధి నిర్వహణలో ఉద్యోగుల సేవలు మరువలేనివని అడిషనల్ ఎస్పీ భీంరావు అన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు రాంచంద్రంను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదన్నారు. విజయవంతంగా సర్వీస్ పూర్తి చేసిన వారి సేవలను పోలీసు శాఖ ఎప్పుడూ మరువదన్నారు. వీరి సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మ్యాకల చంద్రశేఖర్ కోరారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షణా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. కుట్లు, అల్లికలు, పాలిగ్రఫీ, చిత్రలేఖనం, గణితం, ఇంగ్లిష్ వంటి సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నామని, ప్రతి విద్యార్థికి స్నాక్స్‌తో పాటు ఇతర వసతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కొండ్లెపు నారాయణ, ఇంద్రాల రామేశ్వర్, తులసీ ఆగమయ్య, గూడూరు సురేష్, బత్తుల శివప్రసాద్, మల్లేశం, రమాకాంత్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని 14 ఏళ్ల లోపు పిల్లలకు ఉదయం 7గంటల నుంచి 10 వరకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో విద్యార్థులకు కరాటే, యోగాలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వెల్గటూర్ : విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారి నైపుణ్యాలు మెరుగు పరిచేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు పాశిగామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నీలం సంపత్ అన్నారు. వెల్గటూర్ మండలం చెగ్యాంలో ఏర్పాటు చేసి శిబిరాన్ని ఎంఈవో ప్రభాకర్, పాశిగామలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంపత్ కుమార్, మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సీఆర్పీ వైద్య వెంకటేశ్వర్లు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

రాయికల్: మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పాసైన విద్యార్థులకు శనివారం ఉపాధ్యాయులు అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన పారిపల్లి సుప్రజను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముక్కెర మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

మెట్‌పల్లి: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడారు. వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లతో పాటు అన్ని ధృవీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. వీటిని దృష్టిలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.

'ప్రభుత్వ పాలనపై విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి'

మల్లాపూర్: ప్రజాప్రభుత్వ పాలనపై విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు.మండలంలోని రాఘవపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించి ఎస్సెస్సీ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అహర్నిషలు కృషి చేస్తున్నాడన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని ముత్యంపేటలో నిర్వహిస్తున్న నీలగిరి పెద్దమ్మతల్లి జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దు అమృత, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, ఎంఈవో దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం



జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సరితదేవి తెలిపారు. మోడల్‌స్కూల్‌లో ఇంటర్ ప్రథమసంవత్సరం ఆంగ్లమాద్యమంలో చేరేందుకు ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 20న ప్రకటిస్తామని, 27 నుంచి 31 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

జగిత్యాల: గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ అన్నారు. శనివారం పొరండ్లలో గ్రామంలో 135 తెల్లజాతి పశువులకు, 255 గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ వాసు పావని పాల్గొన్నారు.



కోరుట్ల: కోరుట్ల మున్సిపల్ పరిదిలోని యెఖీన్‌పూర్ ఉన్నత పాఠశాలలో 2005–2006 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని, ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోకిల సత్యనారాయణ, గంగామోహన్,మాదవి,సరస్వతి, మహమూద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
జగిత్యాల : సంపత్ - 9676406002
ధర్మపురి : వెంకటేష్ - 8008019205
కోరుట్ల : సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899